# ఎంత దూరం

**అరిగే రామారావు**

"మరోసారి ఆలోచించి చూడు అమ్మలూ! నీవు యిలా వున్నపళంగా అతనికి ముందుగా చెప్పకుండా-చెయ్యకుండా చంటిదాన్ని తీసుకుని బయలుదేరటం నాకంతగా మంచిదనిపించటంలేదు" అని నే నన్నదానికి అమ్మలు చిర్రుబుర్రులాడుతూ యిలా అంది :

"ఇక ఆలోచించవల్సిందేమీ లేదన్నాయ్! బాగా ఆలోచించే నే నీ నిర్ణయానికి వచ్చాను. ఈ మనిషికి యిలా చేస్తేనేకాని తిక్క కుదరదు. ఈ పాడు పల్లెటూళ్ళో నే నుండ లేను బాబోయ్ అని నెత్తీ-నోరూ బాదుకున్నా ఆయనకు తలకెక్కందే? చావనా? ఈ పల్లెటూళ్ళో యీయన యీ బోడివుద్యోగం చేయకపోతే యెవచేడ్చాడో? అడ్డాక్షు సైకి లేసుకుని యీ కొంపలెంట తిరగటమేమిటో—నా పిండాకూడు ఉద్యోగం, ఈ ఉద్యోగమేమిటో? ప్రొద్దుటనగా పోయిన మనిషి సాయంత్రానికికాని రారు. ఆయన కోసం ఎదురుచూస్తూ యీ పిల్లముండా నేనూ బిక్కు బిక్కుమంటూ ఎదురుచూడలేక చావాలి! ఒక సినిమా లేదు, ఒక బీచీలేదు, ఒక పార్కు లేదు, పాడులేదు. ఈ పాడూళ్ళో ఏమీ తోచక ఛస్తున్నా ననుకో—ఈయనగారేమో యీ వూరొదిలి రాను అని కూర్చున్నారు—"

అమ్మలు నాకు చెల్లెలు అవుతుంది. సొంతచెల్లెలుకాదు. మా బాబాయి కూతురు. ఈ వూళ్ళో భర్తతో కాపురం చేస్తోంది. నాకీ వూళ్ళో పొలాలు వున్నాయి. రైతులు పంట డబ్బు సరిగ్గా యివ్వటంలేదు. చాలా బకాయిలు పెట్టారు. ఆ బకాయిల తాలూకు పైకాన్ని వసూలు చేసుకు వెళ్ళటానికి పట్నంనుంచి యీ వూరికి వచ్చాను. ఇక్కడికి వచ్చేముందు మా బాబాయికి ఫోనుచేసి యిలా వెళ్తున్నాను, అమ్మలుకు ఏం చెప్పమంటావు అని అడిగాను. "అమ్మలు యిక్కడికి వస్తానంటోంది, నీవెంట తీసుకునిరారా" అని మా బాబాయి చెప్పాడు. నా పని చూచుకుని అమ్మలు యింటి కెళ్ళాను, ఆమెను నా వెంట తీసికెళ్ళటానికి. తీరా అమ్మలు ఏ పరిస్థితుల్లో ఇక్కడ్నుంచి వస్తుందో విన్నతర్వాత ఆమె యిలా రావటం నాకు మంచిదనిపించలేదు. అందుకే అలా అన్నాను. దానికి ఆమె యిచ్చిన సమాధానం యిది!

అమ్మలుభర్త శర్మ యీ వూళ్ళో విలేజి లెవెల్ వర్కర్‌గా చేస్తున్నాడు. అమ్మలుకు అతని ఉద్యోగం, యీ వూరు నచ్చలేదు. ఈ వుద్యోగం వదిలేసి యీ వూర్నుంచి పట్నం వెళ్ళిపోదాం రమ్మంటుంది. అందుకు శర్మ యిష్టపడటంలేదు. అమ్మలుకేమో పట్నంలో ఆడంబరంగా విలాసజీవితం గడపాలని. శర్మకు యీ పల్లో ప్రశాంతంగా, యీ చిన్నవుద్యోగం చేసుకుంటూ కాలం గడపాలని. ఇక్కడే యిద్దరి అభిప్రాయాలు చెరొకదారిగా వున్నాయి. అవటానికి మళ్ళీ వీళ్ళది ప్రేమ వివాహమే! అమ్మలు కాలేజీలో పి.యు.సి. చదువుతుండగా బి. ఏ. చదువుతున్న శర్మను ప్రేమించి, ఇంటిలోవాళ్ళు ఒప్పుకొనకపోయినా అందర్నీ ఎదిరించి మరీ పెళ్ళాడింది. శర్మ బి. ఏ. పట్టాకు వచ్చిన ఉద్యోగ మది! అతడు మాత్రం ఏం చేస్తాడు? ఈ వుద్యోగంమానేసి మా యింటికివచ్చి ఇని కూర్చోమంటుంది అమ్మలు. ఇది అతని స్వభావానికి విరుదం.

"నీకు తెలియదన్నాయ్. ఇక యీయన్తో ఇలా లాభంలేదు. నేనూ, చిట్టి ఆయనకు కొంతకాలం దూరమైతేగాని ఆయనగారి తిక్క కుదరదు. చిట్టి అంటే ఆయనకు ప్రాణం. అది కొన్నాళ్ళు కనిపించకపోతే దానిమీది మనాదితో పరుగెత్తుకు వస్తారు—"

చదువుకున్న అమ్మలు అనేమాట అది! అంతగా కావాలని ప్రేమించి పెళ్ళాడిన అమ్మలు భర్తతో పల్లెటూళ్ళో కాపురం చేయలేక ఇదవుతోంది. అమ్మలు ఎంతవరకూ తన భర్త తన మాట వినాలని, తన

యిష్ట ప్రకారం నడుచుకోవాలని చూస్తుంది, చేస్తుందేకాని తన అభిరుచులను, ఆలోచనలను అతని కనుగుణంగా మార్చుకోవటానికి కొంచెం కూడా ప్రయత్నించటం లేదు. ఆఖరికి అతడిని తన దారికి మళ్ళించుకోవటానికి అతడింటిలో లేని సమయంలో అతనికి చెప్పకుండా చెయ్యకుండా కూతుర్ని తీసుకుని పుట్టింటికి పోవటానికి సిద్ధమయి కూర్చుంది. నేను చెప్పినా వినలేదు. అమ్మలేగనుక నా సొంత చెల్లెలు అయినట్టయితే ఏం చేసివుండేవాణ్ణో... ... ఏమో! కాదని నేను వెళ్ళిపోయినా అమ్మలు రేపు ఒక్కర్తే అయినా వచ్చేయగలదు. అది వెంట వస్తానంటే తీసుకునిరాలేదు అని రేపు బాబాయి నిష్ఠూరం. మధ్యన నాకెందుకు? సామానంతా నిమిషాలమీద సర్దేసి పిల్లను చంకనేసుకుని, 'ఇక పదన్నాయ్! నీవెళ్ళి బండి తీసుకురా—" అంది. అప్పటికే చీకటి పడింది. నేను వెళ్ళి బండి తీసుకుని వచ్చాను.

ఆమె తలుపులు వేస్తుంటే గోడమీదవున్న శర్మ ఫొటో ఆమెవంక జాలిగా చూస్తున్నట్లనిపించింది నాకు. అమ్మలు యింటికి తాళంవేసి, తాళం చెవి పక్కింటివాళ్ళ కిచ్చింది.

కూతురు చిట్టి, "అమ్మా మనం ఎక్కడికే వెళ్ళేది! నాన్నారు ఏరమ్మా— నాన్నారు మన్తో రా రా — నాకు నాన్నారు కావాలని మారాం చేస్తుంటే దానికి రెండు తగలనిచ్చి బండి ఎక్కింది.

మేం ఎక్కిన బస్సు కదిలేసరికి పూర్తిగా చీకటి పడింది. పగల్లంతా తిరిగి తిరిగి చీకటి పడేసరికి యింటికి వచ్చిన శర్మకు యింటికి తాళం వేసి వుండటం, భార్యా కూతురు లేకపోవటం, చెప్పకుండా పెట్టకుండా భార్య వెళ్ళిపోవటం—నాకు జాలి వేసిందిశర్మమీద. చిట్టి, నాన్న కావాలని మారాం చేస్తుంది. చీకటిపడగానే పాపం తండ్రి వళ్ళో ఆడుకోవటం అలవాటు కాబోలు! నాఆలోచనలు ఈకాలేజి ప్రేమలు, పెళ్ళిళ్ళు, వాళ్ళ కాపురాలు, ఒకరికొకరు ఎడ్జస్ట్ కాకపోవటం— వీటివైపుమళ్ళాయి.

బస్సు ఒకచోట ఆగింది. పొలోమంటూ ఒక ముఠాముఠా ఎక్కారు. అక్కడికి రెండు కోసుల దూరంలో అడవిలోఒకచిన్నపల్లెవుంది. ఆపల్లెలో జరిగిన పెళ్ళికి వచ్చి, ఆముఠావాళ్ళు పెళ్ళయిన తర్వాత తిరిగి వెళ్ళిపోతున్నారట. ఆనట్టడవిలో ఆ కటిక చీకటిలో బస్సుకోసం గంటన్నర నుంచి ఎదురు చూస్తున్నారట. ఈబస్సే ఆ రోజుకు ఆఖరి బస్సు.

ఆముఠా అందరి తరఫున ఒకడు టిక్కెట్లు తీసుకున్నాడు. కండక్టరు వచ్చిన డబ్బులకు, యిచ్చిన టిక్కెట్లకు ఎక్కిన మనుషులు సరిపోయారో లేదోనని అందర్ని లెక్కపెట్టుకుంటుండగా అతడిచూపులు ఒకడిమీద పడ్డాయి. వాడు పూరాగా సారాత్రాగి వున్నాడు. వాడుసీటులో సరిగ్గా కూర్చోలేక పోతున్నాడు. ప్రక్కవాడిన్ని బండబూతులు తిట్టుతున్నాడు. కండక్టరు. ఆత్రాగివున్నవాణ్ణి దింపేయాలి అన్నాడు.

"పెళ్ళి సంబరంలో కూస్తంత తాగేడు వెధవనాయాలగాడు. పోనీయ్ దొరా—" అని ఆ ముఠా తాలూకు మనిషి ఒకడన్నాడు.

"ఆదేం కుదర్దు. త్రాగివున్న వాళ్ళను మాబస్సులో తీసికెళ్ళకూడదు. చెకింగ్ వాళ్ళు వస్తే మాకు మాటవస్తుంది. వాడు దిగాల్సిందే! వాడిని దింపుతారా! లేక మీరంతా దిగుతారా? ఏ సంగతి చెప్పండి—" అని దబాయించాడు.

"ఈ ఎల్లిగాడు ఏంచేసినా ఇంతే నశ! ఇకాగరా అంటే వింటేనా? ముంతమీద ముంత వేసిండుయెదవ"

"ఏఁవే సూరావా! ఆ సచ్చినాడికి బుద్ధిలేదనుకో—నీ బుద్ధేడికెళ్ళిందే? ఆడిసేతికి డబ్బులెట్టా ఇచ్చావ్" ఒక ముసలమ్మ ఎల్లిగాడిపెళ్ళాం సూరిని బుగ్గన పొడిచింది.

"అదొకసంబడం, రొంటినుంచితీసియ్యటం— ఎట్టగయితే నా మొగుడికి నేనేగంద తాగుడుకు డబ్బులిచ్చానని—" సూరి వయస్సుదే ఒకతి మూతి త్రిప్పింది.

"ఆఁ—అట్టకాదంటమ్మా, కూలినాలి సేసిన డబ్బులన్నీ ఆడి దేవశానపోసి సంసారాన్ని ఈకాడికి తెచ్చుకుంది. మేం చెప్పితే వినుకుంటేనా? ఓయబ్బ మొగుడుమీద ఆ పేమ ఏంటో, ఆ కత ఏందో— మేమూ మొగుళ్ళతో సంసారాలు సేత్తున్నాం గాని ఇట్టాకాదమ్మా—' ఈమాటలు అంది సూరి తల్లి ఏమో! పాపం ఆ సూరి అన్న పిల్ల బిక్కమొగం వేసుకుని కూర్చుంది.

"నాకీ ముండ డబ్బులు కావాలేందే! మనం బస్తీకెళ్ళంగాని వెళ్తేనా యమ సంపాయిత్తాంలే! ... ఏంటయ్యా కండకట్టరు— నీవు పెదగవున్నేరునాగా మాటాడుతున్నావ్? అసలెవడహొ తాగింది? తాగేనే అనుకో తీసికెళ్ళవా! డబ్బులు పారేత్తాం తిప్పి తిప్పి... ..." ఎల్లిగాడు చేయి గిర గిర త్రిప్పుతూ అన్నాడు.

"నీవునోరుమూయరా నాయ్యాల! బాబు కండక్టరుబాబు—అడినిరానియ్ బాబు—ఆడల్లరి సేయకుండా మేం సూత్తాంగా? ఇది లాట్టు బస్సు. ఇది తప్పితే ఈ రేతిరికి ఈ అడవిలో వుండిపోవాలి. మళ్ళా రేపు సీకట్లో మా జట్టంతా నాట్లుకు పోవాలి— కూలినాలి సేసుకునేవాళ్ళం దయసూపుబాబు—" అని ఒకతను కండక్టర్ను ఎంతగానో బ్రతిమాలాడు. అయినా కండక్టరు వప్పుకోలేదు.

"ఎల్లిగాడ్ని దింపంతశ—వీడికోసం అంతా ఏడ దిగడాలి—సీకట్లో. కరణంగారి పొలంలో నాట్లుకుపోవాలి— అయ్యా, ఎల్లియ్యా దిగయ్యా—" అని ఎవరో అన్నాడు వాళ్ళమనిషి.

"ఓలమ్మో, ఈసిమ్మసీకట్లో అడ్డొక్కడే ఎట్టుంటాడు? ఎట్టొత్తాడు—" ఎల్లిగాడి భార్య సూరి గుండెలమీద చెయివేసుకుని అంది.

"ఎట్టొత్తాడని తాగుడుకు డబ్బు

లేచ్చావే పిల్లా—అంతా శానాతనం పోతావ్‌గాని—" ఆసూరి అత్తేమో కోడలు బుగ్గపొడిచి మరీ అంది.

"ఏం నీరొంటికాడి ముల్లి వూడ దీసి ఇచ్చావా? నాకట్టం— నాఇట్టం— నా మొగుడి కిచ్చుకున్నా. అడికంటే ఎక్కువేంటి?"

"ఓ యబ్బరాడ మొగుడో!"

"అవతల బస్సు టైం అయిపోతుంది. ఏం వాడ్ని దింపుతారా! మీరంతా దిగిపోతారా! ఏదో ఒకటి తేల్చి చెప్పండి—" కండక్టరు ధాం ధూం లాడాడు.

"ఓరి ఎల్లిగా దిగరా."

"అమ్మో. ఆ డొక్కడేనా?"

"ఓరి బుల్లియ్యా నీవు దిగరా. ఆడ్ని ఏ లారీలోనో బోరీలోనో ఎక్కించుకునిరా—"

"నా వళ్ళు యిరగపొడిసినట్టుంది మావ—"

"ఓరి ఎంకయ్యో, నీవు రా—"

"రేపు పత్తుండమంటావా అన్నియా?"

"అరే కనకాలు నీవన్నా దిగరా—"

"ఏ పోలీసోడో యీడ్ని పట్టుకుంటే వీడ్తోపాటు నన్నూ బొక్కలోకి తోస్తాడు—అసలే పెళ్ళాం బిడ్డలు గలోడ్ని—"

ఇలా ఎవరికివారు ఎల్లికి సహాయంగా మేం దిగమంటే మేం దిగమన్నారు.

"మరి ఎవడికివాడు దిగనంటే ఎట్టరా?"

"ఎట్టగేముంది. ఆ డొక్కడొత్తాడే—"

"ఎవడెందుకశ దిగటం—నేను రాలేకపోతేనా—మనం ఎంత తాగినా శంశార్ పులి—" అని తూలుతూ జారిపోతున్నపంచను ఎగలాక్కుంటూ ఎల్లిగాడు కిందకు దిగాడు.

సూరి కండ్లనిండా నాకు భయం కనిపించింది. భయంగా లేచినిల్చుంది. "నే నొత్తా నుండరా—" అంటూ వాడి వెనకాలే దిగింది.

"ఓసిసీ, నీవెందుకే?" రొమ్ము విరుచుకుంటూ ముందు ముందుకు వచ్చాడు ఎల్లిగాడు.

"ఏంటే పిల్లా నీవు దిగావ్, ఈ సీకట్లో. ఆడు మైకంలో నిన్ను ఏ గొంతు పిసికేసి సంపినా సంపుతాడు—" సూరఅత్త అంది.

"సంపినా సరే. ఆడ్నిమాత్తరం యీ సిమ్మసీకటిలో ఒకడ్నే వదిలేసి నేను సచ్చినా వూరుకోను. ఆ డొక్కడే యీ మద్దెంతరం అడవిలో ఎంగావాలని?—"

"ఓసి, నాకేందే! సీకటయితే ఏఁవే—అడవి అయితే ఏఁవే—మనం సెంశార్ పులి పిల్లా—నీ వెక్కశ—" తూలి పడ్తున్న ఎల్లిగాడ్ని సూరి జబ్బ పట్టుకుని ఆపింది.

ఆ చీకటిలో నక్షత్రాల్లాగా వెల్గుతున్న కళ్ళలో ప్రేమగా మొగుడి వంక చూస్తూ "ఓ యబ్బ శంశారి మావో—" అంది.







ఆ మాటకు అందరూ నవ్వారు. ఎల్లిగాడు ఆ నవ్వులకు రెచ్చిపోయాడు.

"కాక ఏంటే? నేను ఆడముండననుకున్నావే! పోఁయే—పొమ్మంటే పోదేరా—" అంటూ రోషంగా సూరి కొప్పు పట్టుకుని ముందుకు తోశాడు. సూరి ముందుకు తూలి పడింది. తలకాయ వెళ్ళి బస్సు డోర్‌కు కొట్టుకుంది.

"ఎక్కుతావే పిల్లా?" అప్పటికైనా ఎక్కుతుందేమోనని ఎవరో అడిగారు.

"ఆడ్నొదిలి రాను అని ఎన్నిసార్లు సెప్పాలి—" తల పట్టుకుని అంది.

కండక్టర్ "రైట్" అన్నాడు. బస్ కదిలింది.

"పోవే, చూడకాక—" అంటూ సూరిని ముందుకు తోస్తున్నాడు ఎల్లిగాడు.

నేను తలకాయ బైటికిపెట్టి వెనక్కి తిరిగిచూశాను. సూరి కొప్పు పట్టుకుని వీపుమీద గుద్దుతున్నాడు ఎల్లిగాడు. సూరి గింజుకోవటం లేదు. మొగుడిచేతిలో దెబ్బలు తింటోంది.

బస్సు మంచి స్పీడుగా వెళ్ళి

పోతోంది. వెనకాల చీకట్లో ఎక్కడా మనుష్యసంచారంలేని నట్టడివిలో నడిరోడ్డుమీద త్రాగిన మొగుడు చేతిలో దెబ్బలుతింటూ వాడు ఏమై పోతాడోనని భయంతో, వాడికోసం దిగబడిపోయిన సూరిమీద నా కంతు లేని జాలి ముంచుకు వచ్చింది. మొగుడు వద్దు అని కొట్టున్నా వాడినే అంటిపెట్టుకుని వాడి చేతుల్లో దెబ్బలు తింటున్న సూరిలాటి పల్లెటూరి స్త్రీలను నేను ఎప్పటికీ మర్చిపోలేను.

నా దృష్టి అమ్మలుమీద పడింది. చదువుకుని ప్రేమించి పెండ్లాడిన అమ్మలుకు, చదువుకోని పల్లెటూరి సూరికి ఎంత తేడా!

అమ్మలుకూతురు చిట్టి, "అమ్మా! నాన్నారే–నాకు నాన్నారుకావాలే–" అని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆ పసిదాన్ని మంచిమాటలతో సముదాయించటంపోయి దాన్ని కొడుతోంది అమ్మలు. బస్సులోనివాళ్ళంతా కూతురును వూరికే బాదుతున్న అమ్మలు వంక చూస్తున్నారు. "రామ్మ, చిట్టీ–" అని నేను చిట్టిని నా వళ్ళోకి తీసుకున్నాను.

గతుకుల రోడ్డుమీద బస్సు ఎగిరెగిరి పడుతోంది. అలాటి రోడ్డు మీద అంత అర్జంటుగా, అంత స్పీడుగా బస్సునడపాల్సినంత కొంప ముంచుకు పోయే పనులు ఆ డ్రైవరుకు ఏం ఉన్నాయో! ఇంజను పెద్ద రొదచేస్తోంది.. బ్రేకులు కర్‌మంటున్నాయి. బస్సు రోడ్డును తప్పి తుప్పల్లో పడిపోతోంది. లోపలి జనమంతా గొడవ. గభీమని ఒకచెట్టుకు గుద్దుకుని ఆగిపోయింది. బస్సులో లైట్లు ఆరిపోయాయి. ఇంకానయం. బస్సు పల్టీకొట్టి వున్నట్లయితే అంతా చచ్చి వూరుకునేవాళ్ళం. కాస్తంతలో ప్రమాదం తప్పిపోయింది.

"త్రాగుబోతు వాళ్ళంతా డ్రైవర్లయితే ఇంతే–" అని కండక్టరు చిరాకుగా సీటులోంచి లేచి, ఆ డ్రైవర్ని తిడుతూ కిందకుదిగాడు.

□□□




# ఆడ కథ



"ఈ జన్మలోనేకాదు. వచ్చే జన్మలోకూడా నీ మేలు మర్చిపోలేనురా" అంటూ అవలీలగా నా దగ్గర ఐదురూపాయలు అప్పు తీసుకొని సినిమాకి వెళ్ళబోతూన్న మూర్తి అపళంగా ఆగి—

—మళ్ళీ నన్ను అభినందించే వరసలో "ఒరేయ్! నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు. కనీసం నువ్వు అమ్మాయివైనా అయితే కట్నంలేకుండా నిన్ను పెళ్ళిచేసుకుని వుండేవాడిని" అని అర్జంటుగా వెళ్ళిపోయాడు.

"ఏడిశాడు వెధవ. నేను నిజంగా అమ్మాయి నైతేమాత్రం వీడు నన్ను యీ ఐదు రూపాయల అప్పుతో సరిపెట్టుకుని వేరే కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటాడా?" అని నేను స్వగతంలో పైకి ఆలోచించాను.

వాడి కసలు ప్రేమించడమే రాదు. ఇంక పెళ్ళి చేసుకుంటాడా కట్నం లేకుండా? చిన్నప్పటినుంచి ఒకే కంచం, ఒకే మంచంతో సరిపెట్టుకుంటూ

'తంబు'